క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



గండేడ్: వెన్నాచేడ్‌కు చెందిన వెన్న ఈశ్వరప్పను డాక్టరేట్ వరించింది. బెంగుళూరులో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో మదర్‌థెరిస్సా యూనివర్సిటీ వారు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టరేట్ ప్రదానంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో సేవచేస్తానన్నారు. ఈశ్వరప్ప ప్రస్తుతం వీరశైవ లింగ బలిజ లింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ వైస్ ఎంపీపీ

నవాబుపేట: తీగలపల్లికి చెందిన మండల మాజీ వైస్ ఎంపీపీ నారాయణ శనివారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధిని దుశ్యంత్‌రెడ్డి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. భూపాల్‌రెడ్డి, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జడ్చర్ల టౌన్: చర్లపల్లికి చెందిన కావలి నాగేష్ (35) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. కాగా శనివారం జెడ్పీవైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఫోన్‌లో పరామర్శించి, అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కావలి సత్యం, జోగు వెంకటయ్య, వెంకటరమణ, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన నాయకులు



హన్వాడ: మండల కాంగ్రెస్ నాయకుడు రఘుపతిరెడ్డి తదితరులు సీఎం రేవంత్‌రెడ్డి, సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారికి శాలువా కప్పి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి పాటుపడాలని, ఈసందర్భంగా సీఎం సూచించినట్లు వారు వివరించారు.

నాణ్యమైన విత్తనాలను వినియోగించాలి

జడ్చర్ల: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని గంగాపూర్ ,నాగసాల, పెద్ద ఆదిరాల, కొండేడు, పోలేపల్లి, కిష్టారం, శిఖర్‌గాని పల్లి, ఆలూరు, మల్లెబోయిన్‌పల్లి, బూరెడ్డిపల్లి తదితర గ్రామాలలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. బీటీ-3 పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేధించిందని, బీటీ-3 విత్తనాలను సాగు చేయవద్దని కోరారు. అదేవిధంగా లైసెన్స్ పొందిన విత్తన డీలర్ల నుంచి మాత్రమే అనుమతి ఉన్న విత్తనాలను రైతులు కొనుగోలు చేయాలని అన్నారు. రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, బిల్లులపై విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండేలా చూసుకోవాలని అన్నారు. లూజ్ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దన్నారు. ఎమ్మార్పీ ధరలకు మించి విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోండి

నర్వ: మహిళా సమాఖ్య సంఘాలకు పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టుటకు ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. మండలంలో ని 23 పాఠశాలలు, కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను కుట్టుటకు మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావాలన్నారు. ఇప్పటి వరకు 3760 యూనిఫామ్స్ లక్ష్యంగా ప్రారంభం కాగా ఇప్పటి వరకు 633జతల యూనిఫామ్స్‌ను కుట్టడం జరిగిందన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఇప్పటి వరకు 15 సంఘాల సభ్యులు తమ కుట్టుమిషన్‌లతో వచ్చి యూనిఫామ్స్ కుట్టే పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్నారు. కుట్టు పనులు చేపట్టే సభ్యులకు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు పారితోషికం అందిస్తామన్నారు. జూన్ 5 వరకు లక్ష్యాన్ని చేరుకునేటట్లు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8790990595నంబర్‌ను సంప్రదించాలన్నారు.

అండర్‌పాస్ నిర్మాణమెప్పుడో?

- వెంకటగిరి వద్ద పనులు ప్రారంభించకుండానే రైల్వేగేట్‌మూసివేత
- రెండునెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గుంతలమయంగా ప్రత్యామ్నాయ రోడ్డు



రోడ్డును తవ్వి ఇనుప పట్టాలు అడ్డువేయడంతో మూతపడ్డ వెంకటగిరి రైల్వేగేట్

దేవరకద్ర: కౌకుంట్ల మండలం కురుమూర్తి స్టేషన్ సమీపంలోని వెంకటగిరి రైల్వే గేట్‌ను అధికారులు మూసివేయించడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గేట్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం కోసం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే కనీసం అండర్‌పాస్ పనులు కూడా ప్రారంభం కాకముందే రెండు నెలల క్రితమే గేట్‌ను మూసివేసి...రోడ్డును తవ్వి వదిలివేశారు. తాత్కాలికంగా గేటు నుంచి వెంకటగిరి గ్రామం మీదుగా మట్టి రోడ్డు వేసి అమ్మాపూర్ రోడ్డుకు కలిపారు. అయితే ఈ మట్టి రోడ్డు సరిగ్గా లేక పోవడం గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో.. ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహన దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కాగా ప్రసిద్ధి చెందిన కురుమూర్తి ఆలయంనకు, దేవరకద్ర నుంచి ఆత్మకూర్, కొత్తకోట పట్టణాలకు ఇదే దారి ఉంది. ఇలాంటి దారిని రెండు నెలల నుంచి మూసి వేయడం కనీసం పనులు కూడ ప్రారంభించక పోవడంపై ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభం అయి అండర్ పాస్ పూర్తి అయ్యే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాపోతున్నారు. పనులు త్వరగా ప్రారంభించి అండర్‌పాస్ పూర్తి చేయాలని.. ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ప్రథమచికిత్స వరకే పరిమితం కావాలి



సదస్సుకు హాజరైన గ్రామీణ వైద్య సేవకులు

అడ్డాకుల: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల ప్రకారం గ్రామీణ వైద్య సేవకులు ప్రథమ చికిత్స వరకే పరిమితం కావాలని.. పరిధిని మించి చికిత్సలు చేయవద్దని గ్రామీణ వైద్య సేవకుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ తెలిపారు. మూసాపేట మండల కేంద్రంలోని ఆదర్శ వద్ద శనివారం అడ్డాకుల, మూసాపేట మండలాల గ్రామీణ వైద్య సేవకుల సంఘం విజ్ఞన సదస్సును నిర్వహించారు. సదస్సులో శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ వైద్య సేవకులందరు ఐకమత్యంగా ఉండాలని, ఎవరో ఒకరు తప్పు చేయడం వల్ల అందరికీ సమస్యలు వస్తాయన్నారు. గ్రామాల్లో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందిస్తున్నప్పటికీ గ్రామీణ వైద్య సేవకులపై జరుగుతున్న తనిఖీలపై, వైద్య సేవకులు చేయాల్సిన విధివిధానాల గురించి సమావేశంలో చర్చించారు. అనంతరం డాక్టర్ వాసు చైతన్య సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్య సేవకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఇమ్రాన్, హఫీజ్, కిన్నెర రాము, కుర్వ వెంకటేశ్వర్లు, అన్వర్, సుదర్శన్‌గౌడ్, సత్యనారాయణ, ఊరుకుందా తదితరులు పాల్గొన్నారు.

బీవీపీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు భూషణ్‌పాండే అన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో శనివారం బీవీపీ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో గతంలో కంటే ఎక్కువస్థాయిలో బీవీపీలో సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు, యోగాడే, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సభ్యులు రమేష్‌చందర్, పాండురంగం, వీఎస్‌ఆర్‌కే.ప్రసాద్, నాగేంద్రస్వామి, చంద్రుడు, వెంకటేశ్వరగుప్త, యతిరాజాచారి, రాంచందర్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమరరాజా కంపెనీ పనులు ఆపాలని వినతి



టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎదిర వాసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో అమరరాజా బ్యాటరీ కంపెనీ (లిథియం అయాన్ గిగా) పనులను ఆపేయాలని స్థానిక నాలుగో వార్డు పరిధిలోని ఎదిర వాసులు కోరారు. ఈ మేరకు వారు శనివారం కేవీ రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో పరిసర ప్రాంతాలు కాలుష్యం బారిన పడతాయన్నారు. దీని ప్రభావం చుట్టుపక్కల గ్రామాలైన సిద్దాయపల్లి, అంబట్‌పల్లి, దివిటిపల్లిలపైనా పడుతుందన్నారు. గతంలో పీసీబీ అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఇదే విషయాన్ని తెలియజేసినా ఫలితం దక్కలేదన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శివశంకర్, ఎదిర వాసులు సుధా నర్సింహులు, ఎల్.రాములు, ముయ్యాలి నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, ఎ.వెంకటేశ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: మండలంలోని చౌడాయపల్లి గ్రామానికి చెందిన సున్నపు రాములు మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేయించారు. శంకర్, మల్లేష్, బుడ్డన్న, సత్యన్న, రాములు, రామచంద్రయ్య, కుర్మయ్య, బాలస్వామి తదితరులు ఉన్నారు.

పాఠ్యపుస్తకాల పరిశీలన



హన్వాడ: మండలకేంద్రంలోని కేజీబీవీలో డంప్ అయిన పాఠ్యపుస్తకాలను ఎంపీడీఓ యశోద, ఎంపీపీ బాల్‌రాజు శనివారం పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులందరికీ ఉచితంగా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాలు మొత్తం 70శాతం వచ్చాయని, మరో 30శాతం రావాల్సి ఉందని ఎంఈఓ రాజునాయక్ ఎంపీపీ, ఎంపీడీఓలకు వివరించారు. వీటితో పాటు నోటు పుస్తకాలు సైతం విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. సీఎం చిత్రంతో ముద్రించిన నోటుపుస్తకాలను ఎంపీపీ, ఎంపీడీఓలు పరిశీలించారు.

ప్రమాదభరితంగా నీటి సంపు



చిన్నచింతకుంట: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నీటి సంపు ప్రమాద భరితంగా మారింది. పదిఫీట్ల లోతు, ఐదుఫీట్ల వెడల్పు ఉన్న ఈ నీటి సంపును పాఠశాల సిబ్బంది నీటిని నిండుగా మ్యాన్‌హోల్‌పై మూతను పెట్టకుండా వదిలేశారు. దీంతో వేసవి సెలవుల కారణంగా కొందలు చిన్నారులు అక్కడికి వెళ్లి.. సంపు పక్కనే ఆటలు ఆడుతున్నారు. ఈ క్రమంలో సంపులో పడి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రమాదాలు జరగకముందు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రయాణ భారం.. చదువుకు దూరం

- కనీస రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు
- కళాశాలలకు ఎలా పంపాలంటున్న ముంపు గ్రామాల ప్రజలు
- అధ్యాపకుల ఎదుట గోడు వెల్లబోసుకుంటున్న వైనం



ఉదండాపూర్‌లో తమ కళాశాలలో చేరాలని కోరుతున్న జడ్చర్ల ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం

జడ్చర్ల టౌన్: మండలంలోని వల్లూరు, ఉదండాపూర్ వంటి ముంపు గ్రామాలకు చెందిన విద్యార్థులు కనీస రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడంతో పై చదువులకు దూరమవుతున్న పరిస్థితి దాపురిస్తోంది. ఇటీవల పలు ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు... తమ కాలేజీలో విద్యార్థులను చేర్పించాలని ఆయా గ్రామాలకు వెళ్లిన నేపథ్యంలో కనీస బస్సు సౌకర్యం లేకపోతే విద్యార్థులను ఎలా పంపాలంటూ వారి తల్లిదండ్రులు ప్రశ్నించిన వైనం పరిస్థితిని కళ్లకు కడుతోంది. వాస్తవానికి బాదేపల్లి నుంచి బండమీదిపల్లి, పెద్దపల్లిగేట్, వల్లూరు, ఉదండాపూర్ మీదుగా నవాబుపేట మండలం తీగలపల్లి, కాకర్లపహాడ్ నుంచి ఫతేపూర్ మైసమ్మ మీదుగా మహబూబ్‌నగర్ బస్సు రాకపోకలు సాగించేది. ఎప్పుడైతే ముంపు గ్రామాలుగా నిర్ధారణ కావటం, ప్రాజెక్ట్ పనులు కొనసాగుతుండటంతో రోడ్డు పూర్తిగా పాడయ్యింది. ఈ సాకుతో మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో అధికారులు ఆ మార్గంలో బస్సును నిలిపివేశారు. దీంతో సమస్య మొదలైంది. రెండు గ్రామాల పిల్లలు పదోతరగతి వరకు వల్లూరు జెడ్పీహైస్కూల్‌లో చదువు పూర్తి చేసుకుని.. ఆ తరువాత జడ్చర్ల, మహబూబ్‌నగర్ ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేదన్న కారణంతో కళాశాలకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇదిలా ఉండగా రెండు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో పదోవతరగతి పూర్తిచేసిన విద్యార్థులు 50 మందితో పాటు ఇంటర్, డిగ్రీ చేయాల్సిన వారు మరో 100మంది వరకు ఉన్నారు. వీరిలో కొందరి తల్లిదండ్రులు గదులు అద్దెకు తీసుకుని జడ్చర్ల, ఇతర ప్రాంతాల్లో చదివించేందుకు సిద్ధమవుతున్నారు. కానీ మరికొందరేమో అంతస్తోమత లేక వెనుకడుగు వేస్తున్నారు. ప్రత్యేక వాహనాలు పెట్టుకుని కళాశాలకు వెళ్లి వచ్చేంత ఆర్థికపరిస్థితి లేకపోవడంతో మా రాత ఇంతేలే అనుకుని ఉన్నత చదువుల వైపు మొగ్గు చూపడం లేదు. కొంతమంది ఆటోలు వంటి ఏర్పాటు చేసుకుని కళాశాలకు పంపించేందుకు సిద్ధపడినా.. పలు ప్రమాద ఘటనలు చోటు చేసుకోవడంతో వెనుకడుగు వేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల జడ్చర్ల ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం మోజెస్, రఘురాం, సురేందర్‌గౌడ్, రాజులు రెండు గ్రామాల్లోనూ విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని తమ కళాశాలకు చదివించేందుకు పంపించాలని కోరారు. అందుకు తల్లిదండ్రులు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ ఆర్టీసి బస్సు వేయించాలనే డిమాండ్‌ను ముందుంచడం గమనార్హం. ప్రత్యేక ఆటోలు పెట్టి పంపించడమో.. అద్దెకు గదులు తీసుకుని చదివించడమో చేయగలిగేంత ఆర్థిక స్తోమత లేదని నిట్టూర్చాని అధ్యాపకులు చెబుతున్నారు.

చదవాలని ఉంది

పదోవతరగతి పాసయ్యాను. ఇంటర్ చదవాలని ఎంతో ఆశగా ఉంది. అమ్మానాన్నలు కాలేజీకి పంపిస్తామని చెబుతున్నా గ్రామం నుంచి వచ్చిపోయేందుకు ఎలాంటి సౌకర్యం లేదు. ప్రత్యేక వాహనాలు పెట్టి కళాశాలకు పంపించే పరిస్థితి లేదు. ఎం చేయాలో అర్థం కావడం లేదు. నా లాగా చాలామంది ఇబ్బంది పడుతున్నారు.

–కె. సింధు, ఉదండాపూర్

బస్సు వేస్తే బాగుంటుంది

ఉదండాపూర్, వల్లూరు నుంచి జడ్చర్ల, మహబూబ్‌నగర్‌కు బస్సునడిపిస్తే బాగుంటది. పదో తరగతి అయితే ఎలాగోలా పూర్తిచేశాం. కాలేజీ సారోళ్లు వచ్చి మా వద్ద చదువుకోవాలని అని పిలుస్తున్నారు. కానీ ఊరు నుంచి కాలేజికి వచ్చి పోయేందుకు బస్సు లేదు. బస్సు సౌకర్యం కల్పిస్తే నాలాంటి పేదవిద్యార్థుల ఎంతో మేలు జరుగుతుంది.

–పి. శ్రీకాంత్, ఉదండాపూర్

నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి



మాట్లాడుతున్న అధికారులు

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, అధికారుల అదేశాలను పాటిస్తూ విత్తనాల విక్రయాలు చేపట్టాలని విత్తన షాపు డీలర్లకు వ్యవసాయ అధికారులు సూచించారు. శనివారం పట్టణంలోని డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ యశ్వంత్‌రావు మాట్లాడుతూ దుకాణా యాజమానులు రైతులకు విత్తనాలను విక్రయించే సమయంలో పాటించవల్సిన నిబంధనలను వివరించారు. అతిక్రమిస్తే ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రాజేందర్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా అవగాహన కల్పించడంతో మేలు



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: పదోతరగతిలోకి వెళ్లే విద్యార్థులకు వేసవి సెలవుల్లో ముందస్తు అవగాహన కల్పించటం ఎంతో ప్రయోజనంగా మారనుందని జడ్చర్ల, మిడ్జిల్ మండలాల ఎంఈఓ మంజులాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో 30రోజులుగా అవోపా ఆధ్వర్యంలో ఇస్తున్న ముందస్తు శిక్షణ శిబిరం ముగింపు సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. గత 13ఏళ్లుగా అవోపా ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. శిక్షణ ద్వారా 9వతరగతి పూర్తిచేసి పదిలోకి వెళ్లే విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా చదువుతారన్నారు. శిబిరంలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే గణితం, ఆంగ్లం, సామాన్యశాస్త్రం, తెలుగు, ఇంగ్లీష్‌లపై పట్టు సాధించేందుకు ఆస్కారం కలిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అవోపా ఫైనాన్స్ సెక్రెటరీ కందికొండ శ్రీనివాసులు, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్, పట్టణ అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్, మాజి అధ్యక్షుడు నరసింహస్వామి పాల్గొన్నారు.

కేజీబీవీ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలనలో పాల్గొన్న అధికారులు

గండేడ్: మండల కేంద్రంలో కేజీబీవీ నిర్మాణానికి అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో నిర్మాణంపై చర్చించారు. మండల స్పెషల్ ఆఫీసర్ డీడీ పాండు, ఎంపీడీఓ దేవన్నలు ఇతర అధికారులు, స్థానికులతో కలిసి అక్కడికి వెళ్లారు. కాగా గతేడాది గండేడ్‌కు మంజూరైంది. అయితే వసతులు లేక ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో మహమ్మదాబాద్ కేజీబీవీలోనే విద్యార్థులను ఉంచారు. ఈ అకాడమిక్ ఇయర్‌లో కచ్చితంగా గండేడ్‌లోనే కొనసాగించాలని ఉన్నతాధికారులు తెలపడంతో ఏర్పాట్ల కోసం చూస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో పంచాయతీ పక్కన అతిథిలో తాత్కాలికంగా కొనసాగించాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ముందుగా అక్కడికి వెళ్లి పరిశీలించారు. టాయిలెట్లు లేకపోవడంతో వెంటనే ఏర్పాటు చేసేలా చూడాలని మండల అధికారులు స్పెషల్ ఆఫీసర్ పాండు దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పక్కా భవన నిర్మాణానికి కూడా స్థలం కావాలని కోరగా .. పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా.. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పాఠశాల పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ లక్ష్మీబాయితో పాటు పలువురు ఉన్నారు.

టీసీఏ సమ్మర్ లీగ్ విజేతగా జీకేసీఏ-2 జట్టు



విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జీకేసీఏ లీగ్‌లో నాలుగు జట్లు పాల్గొనగా జీకేసీఏ-2 జీకేసీఏ- 3 జట్లు ఫైనల్‌కు చేరాయి. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జీకేసీఏ- 2 జట్టు 39 పరుగుల తేడాతో జీకేసీఏ-3 జట్టుపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన జీకేసీఏ- 2 జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. జట్టులో మనీష్ 66, ప్రణవ్ 27 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీకేసీఏ-3 జట్టు 17.3 ఓవర్లలో 130 పరుగులకు ఆలౌట్ అయింది. సాత్విక్ 61 పరుగులతో రాణించాడు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే..

ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి జీకేసీఏ లీగ్ నిర్వహించినట్లు టీసీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జీకే ప్రేమ్‌కుమార్ తెలిపారు. విన్నర్, రన్నరప్ జట్లకు ఆయన ట్రోఫీలు అందజేశారు. ఇలాంటి లీగ్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు గోపినాథ్, ఫేరోజ్, దినేష్ యాదవ్, స్నేహిత్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



మక్తల్‌లో క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న గోపాలం

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నెల రోజుల పాటు నిర్వహిస్తున్న నెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో పాల్గొంటున్న 50 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా నెట్‌బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, కో-శాధికారి సోహెల్ పాల్గొన్నారు. క్రీడా కారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రీడాలో రాణించి దేశానికి పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్ వెంకటేష్, హెచ్ఎం రమేష్‌శెట్టి, దాతలు ప్రవీణ్‌రెడ్డి, మండల కోచ్ అధ్యక్షుడు గోవర్దన్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కర్ని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏకలవ్య స్పోర్ట్‌ట్స్‌క్లబ్ అధ్యక్షుడు విశ్రాంత పీఈటీ గోపాలం చేతుల మీదుగా శనివారం దుస్తులు పంపిణీ చేశారు. శిక్షణ శిబిరంలో దాదాపు 80మంది విద్యార్థులు ఖోఖో ఉచిత వేసవి క్రీడాశిబిరంలో శిక్షణ పొందుతున్న వారికి గోపాలం తన సొంత ఖర్చులతో దుస్తులు అందజేశారు. అనంతరం పాఠశాలకు చెందిన పీఈటీ రూప ఎస్‌జీఎఫ్‌లో జాతీయ స్థాయిలో క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంపై ఆమెను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రూప, కార్యదర్శి దీప, డి.రాము, రమేష్, అంబ్రేష్, అనిత పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక దాడులు



గిరిజనులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సీఐ

నారాయణపేట రూరల్ : బోయిన్‌పల్లితండా పంచాయతీలో శనివారం ఉదయం స్థానిక ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఈసందర్భంగా తండా మొత్తం పూర్తిగా జల్లెడ పట్టారు. ఎక్కడ సైతం సారా దొరకలేదు. అనంతరం ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్తులను సమావేశపర్చారు. నాటుసారా కాయడంతో కలిగే నష్టాలు, చట్ట ప్రకారం శిక్షలను తెలియజేశారు. గిరిజనులతో నాటుసారా ఆపివేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.